వాజ్‌పేయి జీవితం.. ఆదర్శప్రాయం



అమీర్‌పేట జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: అంకితభావం, నిస్వార్థ రాజకీయానికి నిలువెత్తు నిదర్శనం మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కిషన్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా అమీర్‌పేటలోని గురు గోబింద్‌సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం వెయ్యి మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే ఇదే వేదికపై నిర్వహించిన రక్తదాన శిబిరంలో 200 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వాజ్‌పేయి లాంటి నేత నేటి రాజకీయ నేతలకు మార్గదర్శకుడన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎంతో హుందాగా నడుచుకుంటూ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. దేశంలోని గ్రామ గ్రామాన అభివృద్ధి ఫలాలు అందించిన మేధావి వాజ్‌పేయి అని కొనియాడారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్ధ శతాబ్దానికి పైగా సమాజానికి విశిష్ట సేవలు అందించిన వాజ్‌పేయి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. రాజకీయాలకు సరైన భాష్యం చెప్పిన మహనీయుడిగా అభివర్ణించారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమం బీజేపీ సీనియర్ నేత మర్రి పురురవారెడ్డి, సురేందర్‌రెడ్డి, రవికాంత్‌గౌడ్, వంశీకృష్ణ, మృధుల్, శ్రీకాంత్‌ముదిరాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ పాల్గొన్నారు.

- బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ నెహ్రూపార్కు వద్ద జరిగిన వేడుకల్లో మూల రవీందర్, చంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ..

బౌద్ధనగర్: అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు హనుమంత్ ముదిరాజ్ నేతృత్వంలో ఆదివారం జామై ఉస్మానియా దగ్గరలోని ఓల్డేజ్ హోమ్‌లో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు మేకల కీర్తి, మద్దెర్ల శ్యామ్ సుందర్, సత్యనారాయణ, కొమరయ్య, సుబ్బారావు, రవికుమార్, మహేష్ పాల్గొన్నారు.



సనత్‌నగర్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు

కేలండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: లక్డికాపూల్ మారుతి గార్డెన్స్‌లో సోమవారం 26వ బ్రాహ్మణ వధూవర పరిచయ వేదిక కళ్యాణ సంరంభం నిర్వహించారు. సుమారు 1000 మందికి పైగా నమోదైన వివరాలతో కూడిన వధూవరుల పుస్తకాన్ని బీజేపీ సీనియర్ నాయకులు రామ్‌చందర్ రావు విడుదల చేశారు. దీంతో పాటు ఇంగ్లిష్ తేదీలతో తెలుగు క్యాలండర్‌ను చిత్రపు శేషగిరి, ఫెడరేషన్ ఆఫ్ బ్రాహ్మిన్ మ్యాట్రిమోనియల్ ఇన్ఫర్మేషన్ సొసైటీస్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, కేఎస్ఆర్ చంద్రమూర్తి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకొలను శ్రీనివాసరావు, ఎస్వీఆర్ కృష్ణ ప్రసాద్, రామ్మూర్తి, ప్రకాష్ సూర్యనారాయణ మాచిరాజు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



క్రిస్మస్ గిఫ్టులను అందుకున్న వారితో అధికారులు, కాంగ్రెస్ నేతలు

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని దేవుని గొర్రెపిల్ల సువార్త సంఘం (ల్యాంబ్ ఆఫ్ గాడ్ గాస్పల్) చర్చిలో కాంగ్రెస్ ప్రభుత్వం తరుపున సోమవారం క్రిస్మస్ గిఫ్టులను పంపిణీ చేశారు. అంతకముందు మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు సందేశాన్ని వివరించారు. అనంతరం అధికారులతో పాటు కాంగ్రెస్ నేతలు బాలాజీ, జాన్ తదితరులు హాజరై క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పీఎల్ విక్టర్ ఆంజనేయులు, సేవకురాలు జయలక్ష్మీ, చర్చి సంఘం ప్రతినిధులు దావాదే, బాబురావు, ఏసు, కమలాకర్, వెంకటేష్, రూబెన్ (బాబు) పాల్గొన్నారు

మనుస్మృతి ప్రతుల దహనం

కవాడిగూడ: మనుషుల మధ్య ద్వేషాన్ని నింపి కులమతాల పేరుతో భారతీయులను మనుధర్మ శాస్త్రం విడగొట్టిందని ఇలాంటి చర్యలను ప్రతిఘటించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ మాట్లాడుతూ... ఆర్‌ఎస్ఎస్ రిమోట్ కంట్రోల్‌తో పనిచేస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్ రాజ్యాంగం రద్దుకోసం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. జేఏసీ కో కన్వీనర్ మద్దెల ప్రభాకర్, వర్కింగ్ చైర్మన్ సత్యనారాయణ, నేతలు నిరుడు మల్లేష్, నేతలు కాశీనాథ్, కనకయ్య, యాదగిరి, స్వామిదాస్, బ్యాగరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

రామ మందిర అక్షితల ఊరేగింపు

చిక్కడపల్లి: అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ట పూజిత అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని సోమవారం బీజైవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ బీజేపీ నేతలు శ్రీకాంత్, చిన్న, ఉమేశ్, ఆకుల సురేందర్, నర్సింహా, సంఘపరివార్, కార్యకర్తలు వెంకటరమణ, రామారావు, రాజేశ్వర్‌రావు, సాయి, ఆదిత్య, శివరతన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



బాలఏసును పూజిస్తూ..



జన్మవృత్తాంతాన్ని తెలియజేసేలా ఏర్పాటుచేసిన క్రిబ్ ముందు ఫొటోలు దిగుతున్న చిన్నారులు



కొవ్వొత్తులు వెలిగిస్తూ..

క్రీస్తు సందేశం.. ప్రేమ మార్గం

- అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు
- ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్‌లు

సనత్‌నగర్: క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలో వీధులన్నీ పండుగ శోభతో అలరించాయి. ఇంటింట రంగురంగుల స్టార్స్ మెరిశాయి. క్రిస్మస్ ట్రీని బెల్స్, గిఫ్ట్ బాక్స్‌లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చిలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. సోమవారం అశేషంగా తరలివచ్చిన క్రిస్టియన్ సోదర సోదరీమణుల నడుమ మత పెద్దలు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా, ఫ్లైఓవర్ పక్కనున్న మెథడిస్ట్ చర్చి, ఎండీ ఇమానుయేల్, సీఎస్ఐ, బాప్టిస్టు, బల్కంపేట్‌లోని యునైటెడ్ ఇండిపెండెంట్, యేబ్రోను చర్చిలతో పాటు సనత్‌నగర్ నియోజకవర్గంలోని అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలుచోట్ల క్రీస్తు జనన ఉత్థానాన్ని బొమ్మల రూపేణా తెలియజేసిన తీరు ఆకట్టుకుంది.

ఏసుక్రీస్తు సూక్తులను అనుసరించాలి..

ఏసుక్రీస్తు సూక్తులను ప్రతి ఒక్కరూ అనుసరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం సికింద్రాబాద్‌లోని వెస్లీ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం బిషప్ పద్మారావు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఫాదర్స్ జేమ్స్, చర్చి కమిటీ సభ్యులు చందన్, సుధీర్, దివాకర్, దేవ సహాయం, కమలాకర్, ఫ్రాన్సిస్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

తార్నాకలో..

లాలాపేట: తార్నాకలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం బాప్టిస్టు చర్చి, ఐనోస్ చర్చి,



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని



క్రిస్మస్ వేడుకల్లో రెవరెండ్ ఆర్. విలియం కేరీ

లాలాపేట్ లోగోస్ గోస్పెల్, మెథడిస్ట్ చర్చి, ఎవంజలికల్ బాప్టిస్టు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులందరూ చర్చిల్లో ప్రార్థనలు చేసి కేక్‌కట్ చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం..

రసూల్‌పురా: క్రీస్తు బోధనలు అనుసరణీయమని కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ ఇన్‌చార్జి వెన్నెల గద్దర్ అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా న్యూ లైఫ్ ఆఫ్ అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వెన్నెల సోమవారం పాల్గొన్నారు. ఈ క్రిస్మస్ అందరికి ఆనందం, శాంతి కలుగజేయాలని సామరస్యం,కరుణతో అందరు పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ..

చిలకలగూడ : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని దూద్‌బావి హోసన్న పెంతికోస్తు, చిలకలగూడ సీఎస్ఐ వెస్లీ చర్చిల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను సందడిగా నిర్వహించారు. హోసన్న పెంతికోస్తు చర్చిలో పాస్టర్ జాయ్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి రాష్ట్ర ప్రభుత్వం తరుపున నిరుపేద క్రిస్టియన్లకు దుస్తులు, క్రిస్మస్ కానుకలను అందించారు. అనంతరం హోసన్న పెంతికోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు జాయ్, పాల్, శ్యాంసన్, దానియల్, సంఘ పెద్దలు జేమ్స్, ప్రసాద్, పాల్, మల్లాది, చిన్నప్ప, ప్రభుదాస్ పాల్గొన్నారు.

- సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు సీతాఫల్‌మండి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బండి అభిషేక్ ముదిరాజ్ నేతృత్వంలో సోమవారం పలు చర్చిల్లో నిరుపేద క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుకలు అందించారు. కాంగ్రెస్ నాయకులు సాయిమధుకర్, పాల్, ప్రకాశ్, సందీప్, హరీష్, మురళీ, విల్సన్ పాల్గొన్నారు.



హోసన్న పెంతికోస్తు చర్చిలో కేలండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం



సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో క్రిస్టియన్లు

ముగిసిన స్పోర్ట్స్ లీగ్

సనత్‌నగర్: లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అటల్ బిహారీ వాజ్‌పేయి స్పోర్ట్స్ లీగ్ సోమవారం ముగిసింది. క్రికెట్ విజేతగా ఎన్ఆర్ఐ కళాశాల జట్టు, రన్నర్‌గా వీఏన్‌బీసీ కళాశాల జట్టు నిలిచింది. కబడ్డీ విజేతగా రాయల్ కాలేజీ, రన్నర్‌గా నారాయణ కళాశాల టీమ్ నిలిచింది. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి హాజరయ్యారు. అంతక ముందు స్పోర్ట్స్ లీగ్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు సందర్శించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయి రాథోడ్, గోవింద్ రాథోడ్, కోఆర్డినేటర్లు సునీల్‌కుమార్, వైష్ణవి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ లీగ్ నిర్వాహకులతో కావ్యారెడ్డి

ఘనంగా 'స్వరమాధురి' రజతోత్సవాలు

చిక్కడపల్లి: స్వరమాధురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ మ్యూజిక్ సంస్థ రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో సంస్థ విద్యార్థులు వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్య, త్యాగరాజు, శామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్‌ల కీర్తనలను మధురంగా ఆలపించి శ్రోతలను రంజింపచేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు, గాయని చెన్నాప్రగడ అహల్యతో పాటు పలువురు ఆలపించిన కీర్తనలు గానసభలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకువచ్చాయి. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నృత్యవిభాగం హెడ్ డాక్టర్ శుత్రకీర్తి జొన్నలగడ్డ మాట్లాడుతూ... సంగీతం అభ్యాసంతో విద్యార్థుల్లో ఏకాగ్రత అలవడుందన్నారు. శాస్త్రీయ సంగీతం పట్ల చిన్నారులను ఆకర్షితులను చేసి వారికి సంగీతంలో శిక్షణ ఇప్పించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెన్నాప్రగడ శిరీష్‌కుమార్, చెన్నాప్రగడ అహల్య, స్పిరిచువల్ ఆరేటర్, టీవీ ప్రెజెంటర్ జ్యోతి శరత్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



సంగీత కార్యక్రమాలు నిర్వహించిన చిన్నారులతో శుత్రకీర్తి, జ్యోతిశరత్, అహల్య తదితరులు

'బీజేపీ సర్కారు కుట్రలను తిప్పికొట్టాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్‌ఎస్ఎస్ రిమోట్ కంట్రోల్‌తో పని చేస్తున్న బీజేపీ సర్కార్ రాజ్యాంగ రద్దుకు చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. మనుషుల మధ్య ద్వేషాన్ని నింపి అనైక్యతను సృష్టించిన మనుస్మృతి భావాలను వ్యతిరేకించాలన్నారు. సోమవారం సుందరయ్య పార్కు వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో మనుస్మృతి గ్రంథం ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ... ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా మన దేశంలో సామాజిక అసమానతలను మనుధర్మ శాస్త్రం సృష్టించిందన్నారు. దేశంలో నూటికి 90 శాతం మందికి చదువు, సంపదలు దూరం చేసి కేవలం పది శాతం మంది కోసం మేజార్టీ ప్రజలను బానిసలుగా మార్చిందని విమర్శించారు. మనువాదాన్ని ఈ దేశం మట్టిలోనే పాతరేయాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని కాపాడడానికి దోపిడి వ్యవస్థ రక్షణకై పుట్టిందే మనువాదం అని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు ఎస్.బాలు, బి.సుబ్బారావు, జి.రాములు, పవన్, చెన్నయ్య, పి.వెంకన్న, లక్ష్మి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య పార్కు వద్ద మనుధర్మ శాస్త్రం ప్రతులను దహనం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నేడు ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: శ్రీదత్తాత్రేయ జయంతి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలోని దత్తాత్రేయ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు అభిషేకం, అనంతరం ప్రత్యేక అల ంకరణ దర్శనం, అర్చన కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి జన్మోత్సవ ఊయ ల సేవ, తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు.

- మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీదుర్గా మాత ఆలయంలో మంగళవారం ఉదయం 8 గంటలకు చండీహోమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఓయూ డిగ్రీ పరీక్షలకు ఏర్పాట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నట్లు వివిధ డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. బీఏ, బీకాం, బీఏ స్సీ, బీబీఎం తదితర రెగ్యులర్ డిగ్రీ కోర్సుల మొద టి సంవత్సరం విద్యార్థులకు జనవరి వరకు కొనసాగునున్నట్లు కంట్రోలర్ ప్రొ.రాములు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 60, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 65, పందిరి బీర 55, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 55, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 75, గోకరకాయ 60, కీర 17, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 47, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 17, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పవర్ బోర్ పనులు ప్రారంభం

లాలాపేట: మానికేశ్వర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన పవర్‌బోర్ పనులు సోమవారం బీజేపీ నేత గండికోట నరసింహ ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు, సిబ్బందికి నీటి సమస్యను తీర్చేందుకు కేంద్రమంత్రి పవర్ బోర్‌ను మంజూరు చేసినట్లు నర్సింహ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఇద్దయ్య, శ్రీనివాస్, చరణ్, నాని, సత్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషిచేస్తా : మంత్రి



కేలండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

చిలకలగూడ : శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం రూపొందించిన ప్రత్యేక కేలండర్‌ను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. ఈఓ రాజేష్ కుమార్ నేతృత్వంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ప్రసన్న వెంకన్నస్వామి ముఖచిత్రంతో రూపొందించిన కేలండర్‌ను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఆలయ ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామసూర్యసుబ్రహ్మణ్యం, నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిగా ఓబీసీని నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షుడిగా ఓబీసీ నేతను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. సోమవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీకి మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తెలంగాణలో 55 శాతం పైగా ఉన్న ఓబీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందన్నారు. సీఎంగా రెడ్డిని, డిప్యూటీ సీఎంగా ఎస్సీని నియమించిన కాంగ్రెస్ అధిష్టానం పార్టీ అధ్యక్షుడిగా ఓబీసీని నియమించాలన్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 16 టీమ్‌లు పోటీ పడనున్నట్లు జనరల్ మేనేజర్ రాజేష్, హైదరాబాద్‌సర్కిల్ కెప్టెన్ ఆకాష్ బండారి తెలిపారు.



జ్యోతి ప్రజ్వాలన చేస్తున్న రాజేష్

సోచ్ నుంచి రెడ్ డాట్ కలెక్షన్

సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయ ఎత్నిక్ వేర్‌కు పేరొందిన దుస్తుల సోచ్ బ్రాండ్... రెడ్ డాట్ సేల్ పేరిట సరికొత్త కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. వింటర్ సీజన్ స్పెషల్‌గా చీరలు, సల్వార్ సూట్లు, కుర్తాలు, కుర్తా సెట్‌లు, డ్రెస్ మెటీరియల్స్, ట్యూనిక్స్ కఫ్తాన్‌లతో సహా ఈవెనింగ్, అకేషనల్ వేర్ తదితర దుస్తులు ఈ కలెక్షన్‌లో ఉన్నాయని, నగరంలోని తమ అన్ని స్టోర్స్‌లో ఇవి అందుబాటులో ఉన్నాయన్నారు.

ఇఫ్లూలో ఉద్యోగాలను భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారులను కోరారు. ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ 93 (బోధనేతర ఉద్యోగాలు) పోస్టులకు ఆరు నెలల క్రితం నోటిఫికేషన్లు జారీ కాగా వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇంత వరకు ఉద్యోగాల భర్తీకి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు చేపట్టక పోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కమల డ్యాన్స్ అకాడమీ 5వ వార్షికోత్సవం సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు అన్నమయ్య, రామదాసు కీర్తనలపై ప్రదర్శించిన పలు సంస్కృతిక నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా కమల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ దాసరి సురేఖ మాట్లాడుతూ... తమ అకాడమీ విద్యార్థులు తిరుపతి, జోగులాంబ తదితర ప్రముఖమైన దేవాలయాల్లో ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

అయ్యప్ప రథయాత్ర

లాలాపేట: లాలాపేటలోని లక్ష్మీ గణపతి సాయి అయ్యప్ప దేవాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించే అయ్యప్ప స్వామి మహా పడిపూజను పురస్కరించుకొని ఆదివారం రథయాత్ర నిర్వహించారు. ఈ నెల 27న లక్ష్మీ గణపతి సాయి అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న అయ్యప్ప మండల పూజ కోసం ఆదివారం ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఇతర స్వాములు కలిసి రథయాత్ర నిర్వహించారు. మేళతాళాలతో అయ్యప్ప భజనలు చేసుకుంటూ వీధి వీధి తిరుగుతూ విరాళాలు, దానాలు సేకరించారు. బాల్‌రాజ్ గుప్తా, శ్రీనివాసులు గౌడ్, పేపర్ శ్రీను, గణేష్ యాదవ్ పాల్గొన్నారు.



అయ్యప్ప రథయాత్రను ప్రారంభిస్తున్న స్వాములు